గల్లా పట్టి.. రోడ్డుపై ఈడ్చుకెళ్లి..

● వృద్ధుడిపై తాగుబోతుల దాష్టీకం.. పోలీసులకు ఫిర్యాదు

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): "మా బిల్డింగ్‌లో మద్యం తాగుతున్నారేంటి?" అని నిలదీసిన వృద్ధుడిపై మందుబాబులు దాడి చేశారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. 70 ఏళ్ల వృద్ధుడు గణేష్ ప్రసాద్. అతను గణేష్ కాంప్లెక్స్ యజమాని. తన కాంప్లెక్స్‌లోకి వెళ్లి దారిలో మెట్లపై తాగుబోతులు అడ్డంగా కూర్చున్నారు. "మీరు మా బిల్డింగ్‌లో ఎందుకు తాగుతున్నారు" ఎదురుగా ఉన్న వైన్స్‌లోకి వెళ్లాలని సూచించాడు. కోపోద్రిక్తులైన ముగ్గురు.. వృద్ధుడి గల్లా పట్టుకొని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి కింద పడేసి కొట్టారు. అప్పుడే ఈ కాంప్లెక్స్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, చుట్టుపక్కల ఉన్న వారందరూ ఈ ప్రాంతానికి చేరుకోవడంతో ఇద్దరు పారిపోయారు. ఒకరిని మాత్రం వారు పట్టుకున్నారు. వెంటనే పోలీసులు సమాచారం అందించారు. వారు ఇక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా చుట్టుపక్కల దుకాణాదారులు, స్థానికులు ప్రజలు మాట్లాడుతూ రోజురోజుకూ వైన్స్ ఎదురుగా తాగుబోతులు రోడ్డుపై వెళ్లి వారిని ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు.

జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి

● బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు అజయ్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రక్షణ చట్టం తీసుకు రావాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డీ అజయ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ కార్పొరేట్ స్కూల్స్, ఆసుపత్రిల్లో ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాలను కోరారు. వెంటనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం తొలగింపజేస్తున్న ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుడి సేవాతత్వం

● సొంత నిధులతో శుభ్రతకు ప్రాధాన్యం

సరూర్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో అల్మాస్‌గూడ 26వ డివిజన్ న్యూతిరుమలానగర్ కాలనీ.. ఖాళీ స్థలాలలో చెట్ల పొదలు, వ్యర్థాలను తొలగింపజేశారు. అందులో విషపురుగులు సంచరిస్తున్నాయని కాలనీవాసుల ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు రామిడి ఉపేందర్‌రెడ్డి, సలహాదారుడు ఎల్‌కే ప్రభాకర్‌రావు, ప్రతినిధులు రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

చంపాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్.. మిధానీ ఆర్టీసీ బస్‌డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, విలువైన సూచనలు, సలహాలను 9959226139 నంబర్‌లో తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పడి పూజలో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, అయ్యప్ప స్వాములు

ఘనంగా మహాపడి పూజ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి.. అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా జరిగింది. ఏపీ మాజీ మంత్రి, కళాశాల చైర్మన్ గురుస్వామి ముత్తంశెట్టి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాది మంది అయ్యప్ప స్వాములు హాజరయ్యారు. అయ్యప్ప భక్తి పాటలు, నామస్మరణతో కళాశాల ప్రాంగణం మారుమోగింది. కార్యక్రమంలో చైర్మన్ కుటుంబ సభ్యులతో పాటు అధ్యాపక బృందం, హెచ్‌వోడీ, సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరైన పారిజాతారెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కొత్త వెలుగులు

● బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాతారెడ్డి

● కుర్మల్‌గూడలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి హాజరు

సరూర్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేక మంది పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నదని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఇల్లు మంజూరైన కుర్మల్‌గూడకు చెందిన గిరి దంపతులు తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ఆదివారం గృహ ప్రవేశం చేశారు.. పూజా కార్యక్రమానికి పారిజాతారెడ్డి విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మభ్యపెట్టిందని, ఎవరికీ దాని వల్ల ప్రయోజనం కలగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ పథకాన్ని ప్రవేశపెట్టి, అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు జారీ చేశారని పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయని, త్వరలోనే సదరు లబ్ధిదారులందరూ సొంతిళ్లలో అడుగుపెట్టబోతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్టు బాలకృష్ణ, కుమార్, గిరిముదిరాజ్, అనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరికుంట, బాతుల చెరువు..

దుర్వాసనకు నిలయం

టంకు లేన్‌కు మరమ్మతుల సందర్భంగా ఉప్పొంగిన మ్యాన్‌హోల్స్

చెరువుల్లోకి మురుగు పంపింగ్

రెండు నెలలుగా వేధిస్తోన్న సమస్య .. ఇబ్బందుల్లో పదికాలనీల వాసులు

హయత్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ చెరువులు.. డ్రైనేజీ నీటితో నిండాయి. అందులో వచ్చే దుర్వాసనతో పది కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా సమస్య పరిష్కారానికి నోచడం లేదు. మూడు రోజుల క్రితం సంబంధింత కార్యాలయం ఎదుట నిరసన, ధర్నా చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. కుమ్మరికుంట, బాతుల చెరువు దుస్థితి ఇదీ.. ఇటీవల కురిసిన వర్షాలకు గుర్రంగూడ ఫారెస్టు, బీఎన్‌రెడ్డి, వనస్థలిపురం పై కాలనీ నుంచి వచ్చే వరద నీరు ట్రంకు లేనులో కలవడంతో ఒత్తిడి పెరిగింది. దీంతో హయత్‌నగర్‌లోని పాత రోడ్డు, జాతీయ రహదారి, వీరభద్రనగర్ కాలనీ, పద్మావతి కాలనీలలోని మ్యాన్‌హోల్‌లు కుంగి, భారీ గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు మరమ్మతులు చేసే క్రమంలో ట్రంకు లేన్ ప్రవాహన్ని అడ్డుకట్ట వేసి మరమ్మతులు చేస్తుండగా సామనగర్, పద్మావతి కాలనీలోని మ్యాన్‌హోల్స్ ఉప్పొంగి మురుగు కాలనీలను ముంచేసింది. చేసేది లేక అధికారులు మురుగును కుమ్మరికుంట చెరువులోకి పంపించారు. కుమ్మరికుంట, బాతుల చెరువులు మొత్తం మురుగు నీటితో నిండి దుర్వాసన పంచుతున్నాయి. ట్రంకు లైను ద్వారా వచ్చే భారీ ప్రవాహన్ని ఆపి మ్యాన్‌హోల్ నిర్మించడం అధికారులకు తలనొప్పిగా మారింది.



మురుగు నీటితో నిండిన కుమ్మరికుంట చెరువు, బాతుల చెరువు



కుమ్మరికుంట నీటిని బయటకి పంపాలి



మురుగునీటితో నిండిన కుమ్మరికుంటను ఖాళీ చేయించాలి. నెల రోజులుగా మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వస్పరికాలనీ, సాయికాలనీ, రామకృష్ణానగర్, శాంతినగర్, మైత్రి విల్లాస్‌తో పాటు మరిన్ని కాలనీలకు దుర్వాసన వస్తోంది. వెంటనే మురుగునీటిని ఖాళీ చేయించాలి

- కె. జనార్దన్‌రెడ్డి, వస్పరికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

రాత్రి సమయంలో భోజనం చేయలేకున్నాం



కుమ్మరికుంట, బాతుల చెరువులు మురుగుతో నిండినప్పటి నుంచి విపరీతమైన దుర్వాసన వస్తున్నది. రాత్రిపూట తీవ్రమైన వాసనతో ఇంట్లో భోజనం చేయలేక పోతున్నాం. విషపురుగులు సైతం ఇళ్లలోకి వస్తున్నాయి

- తీగల మాధవి, గృహిణి



సామనగర్ నుంచి డైవర్షన్ ..

వనస్థపురం, బీఎన్‌రెడ్డి, కాలనీ నుంచి వచ్చే మురుగును సామనగర్ నుంచి దారి మళ్లించాలి. అందుకోసం అక్కడి నుంచి రామకృష్ణానగర్, ముదిరాజ్‌కాలనీ మీదుగా కొత్త ట్రంకు లేన్ వేయాలి. దీంతో పద్మావతి కాలనీ గుండా ఉన్న ట్రంకు లేన్‌కు ఒత్తిడి తగ్గుతుంది.

- కల్లెం నవ జీవన్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్

పనులు ప్రారంభిస్తాం

హయత్‌నగర్ బస్సు డిపో వద్ద నుంచి ఉన్న ట్రంకు లేనుకు మురుగునీటి ప్రవాహం ఒత్తిడి పెరగడంతో మ్యాన్‌హోల్స్ కుంగి ఇబ్బందులు వస్తున్నాయి. ఇక్కడి పరిస్థితిని ఈఎన్‌సీకి చెప్పాం. మిషనరీ తెప్పించి పనులు ప్రారంభిస్తాం. పై నుంచి భారీగా మురుగునీరు వస్తున్నది. పనులు చేయడం ఇబ్బందికరంగా మారింది. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

- మహేందర్ నాయక్, జలమండలి డివిజన్-11 ఆపరేషన్- మెయింటనెన్స్ జీఎం, హయత్‌నగర్



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సన్మానించి, జ్ఞాపికను అందజేస్తున్న మన్సూరాబాద్ పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు



కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం మన్సూరాబాద్ అధ్యక్షుడు గంజి సత్తయ్య, సభ్యులు

ఘనంగా కార్తీక వనమహోత్సవాలు

మన్సూరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

దిల్‌సుఖ్‌నగర్ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో...

దిల్‌సుఖ్‌నగర్ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ ఎల్బీనగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కమ్మ సేవా సంఘం దిల్‌సుఖ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు కొల్లి నాగేందర్‌రావు, ప్రధానకార్యదర్శి ఎస్వీ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, ఏఐసీసీ ప్రధానకార్యదర్శి జెట్టి కుసుమకుమార్, తెలంగాణ జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు విచ్చేశారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘం సభ్యులు చక్రధర్‌రావు, మహరాజ్ చౌదరి, బాపినేడు, వై.వెంకట్‌గాంధీ, సూర్యప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో...

పద్మశాలి కార్తీక వనభోజన మహోత్సవాన్ని మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. మన్సూరాబాద్ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. పద్మశాలి సంక్షేమ సంఘం మన్సూరాబాద్ అధ్యక్షుడు గంజి సత్తయ్య ఆధ్వర్యంలో అతిథులను సన్మానించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, సంఘం సభ్యులు గంజి వెంకటేశం, రుద్ర లక్ష్మీనరసింహ, సీతా వెంకటేశం, గజం సత్యనారాయణ, గుర్రం రమేష్, అప్పు సుదర్శన్, చిక్క భారతమ్మ, గంజి సాంబమూర్తి, పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, గంజి సుధాకర్, గుర్రం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో...

తెలంగాణ మున్నూరుకాపు సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మున్నూరుకాపుల వివాహ పరిచయ వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా వంటివి ఘనంగా నిర్వహించారు. ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ హరిణ వనస్థలి జాతీయ పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి మున్నూరుకాపు మహిళలు, యువత, చిన్నారులు హాజరై సందడి చేశారు. పలువురు కుల పెద్దలు, మేధావులు, ప్రముఖులు విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మల్యాల మదన్మోహన్, సింగం సీనయ్య, శ్రీధర్, సింగం సుధాకర్, సింగం రాజు, కంఠం కృష్ణ, కంచి కృష్ణమోహన్, ఆకుల సాయికుమార్, ఉప్పల గోపాల్ తదితరులు ఉన్నారు.



చంపాపేట: వనభోజనాల కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

సాయిరాంనగర్ కాలనీలో...

చంపాపేట: చంపాపేట డివిజన్ సాయిరాంనగర్‌కాలనీలో ఉన్న గణేష్ పార్కులో ఆదివారం కాలనీవాసులు కార్తీక వనభోజనాల మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. కాలనీ అధ్యక్షుడు జి.సుధాకర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు.. కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి చంద్రపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అంజిరెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు ముకుందరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సురంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరిస్తా

● కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ బాతుల చెరువులో కలుస్తున్న మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ విషయాన్ని ఆనంద వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు వివరించారు. మారం అపార్ట్‌మెంట్ సమీపంలో బాతుల చెరువు పూర్తిగా మురుగు నీటితో నిండిపోయిందన్నారు. ఇందులో నుంచి దుర్వాసనతో పాటు విపరీతంగా దోమల బెడద పెరిగిందన్నారు. చెరువులోకి మురుగు చేరకుండా ప్రణాళికలు సిద్ధం చేశామని నవజీవన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం చెరువులో ఉన్న మురుగు నీటిని బయటకు పంపించేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మారం అపార్ట్‌మెంట్స్ అధ్యక్షుడు పల్లె మధు, సభ్యులు దేవిదాస్, జలంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కుమార్‌గౌడ్, ఆర్‌సీఎస్‌రెడ్డి, రమణరెడ్డి, చంద్రకాంత్, లక్ష్మీసాయికుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్స్ వాసులు

కారు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

● హాఫీజ్ బాబానగర్‌లో ఘటన

చంపాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వచ్చిన కారు.. బాలుడిని ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన హాఫీజ్ బాబానగర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. హాఫీజ్ బాబా నగర్ సి- బ్లాక్‌లో నివాసముంటున్న మహ్మద్ అలీ కుమారుడు అమేర్ అలీ(8) కిరాణా దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు.. అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు కింద చిక్కుకున్న బాలుడిని స్థానికులు బయటికి తీశారు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. అలీ తండ్రి మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కంచన్ బాగ్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ తెలిపారు. కారు డ్రైవర్ గౌస్‌పై కేసు నమోదు చేశారు.

సీపీఐ నేత దేవయ్య సేవలు ఎనలేనివి

మన్సూరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ కార్మిక సంఘంలో కీలకపాత్ర పోషించడంతో పాటు సీపీఐ బలోపేతానికి నాగిళ్ల దేవయ్య సేవలు ఎనలేనివని, ఆయన లేకపోవడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రచారి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోల్.. ఎస్‌ఏ డాంగే భవన్.. సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం దేవయ్య సంతాప సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా రవీంద్రచారి విచ్చేసి దేవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు బోయపల్లి రాములుగౌడ్, చంద్రమౌళి, కర్నాకర్‌రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, కందుల సుధాకర్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 11కేవీ అక్బర్‌బాగ్ ఫీడర్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. టీజీఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లో మరమ్మతు పనుల కారణంగా స్టాన్లీ స్కూల్, ఉజలేషా దర్గా, జీవన్ యార్ జంగ్ కాలనీ, డీ క్వార్టర్స్ పరిసర ప్రాంతాలలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ ఉండదని ఆయన తెలిపారు.



వన భోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

అందరూ ఐక్యంగా ఉండాలి

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి జీవిస్తూ.. సమాజానికి ఆదర్శంగా నిలవాలనీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలో గౌడ్, శెట్టి బలిజ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభోజన మహోత్సవానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శివునికి ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసులు కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి జీవించాలని సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.వి.వి. సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామచందర్‌రావు

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

ఎల్‌బీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ భారీ విగ్రహాన్ని ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావులు ఆవిష్కరించారు. ఛత్రపతిహిల్స్ కాలనీలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తాను నూతనంగా నిర్మించుకున్న ఐదో అంతస్తుపై 16 అడుగుల శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. చిన్ననాటి నుంచి ఛత్రపతి విగ్రహం ఏర్పాటు చేయాలన్న కోరికను ఆయన నెరవేర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు తూళ్ల వీరేందర్‌గౌడ్, ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ సీనియర్ నాయకులు బొక్కా నర్సింహారెడ్డి, సామ రంగారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, రాధ ధీరజ్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి ఇతర ప్రముఖులు, వివిధ మోర్చాలకు చెందిన మహిళలు, నాయకులు, వనిపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పంచలోహ ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఈవో ఎన్.లావణ్య, ధర్మకర్తలు

ప్రత్యేక పూజలు

చంపాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రంగనాయకస్వామి పంచలోహ ఉత్సవ విగ్రహాలకు ఆదివారం ఆలయ వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు, హోమం, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలోని కోదండ రామాలయంలో విశేష పూజలు సైతం చేశారు. దాతలు శేఖర్‌రెడ్డి, విమల దంపతులు అందజేసిన విగ్రహాలను ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఈవో ఎన్.లావణ్య, ధర్మకర్తలు స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గోపాల్‌రెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్, సింగొట్టి శ్రీనివాస్, సంతోష్‌కుమార్, తోకటి కిరణ్‌కుమార్, ఎనుముల రవీందర్‌రెడ్డి, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, కవిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.